క్లుప్తంగా

దుర్గాదేవికి ప్రత్యేకాలంకరణ



పట్టుచీరల అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గమ్మ

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ దుర్గాదేవి అమ్మవారు పట్టుచీరలతో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ నిర్మాణకర్త ఎరుబండి రామాంజనేయులు దంపతులు, దాతల సహకారంతో అమ్మవారిని సుమారు 108 పట్టుచీరలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి దొడ్డిపట్లకు చెందిన జగదీష్- సంధ్య దంపతులు 4 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ అమ్మవారి ప్రసాదం, రసీదును అందించారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలికి గాయాలు

భీమవరం (ప్రకాశంచౌక్): వన్‌టౌన్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో కె.జయలక్ష్మి అనే వృద్ధురాలి చీరకు నిప్పు అంటుకోవడంతో గాయపడిందని పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి మంట కాగుతుండగా ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుందన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏఎస్సై కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

శ్రీవారికి సేవాభాగ్యం పూర్వ జన్మ సుకృతం

టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు వెల్లడి



ఆకివీడు ఉప్పుటేరు వంతెన వద్ద సుబ్బరాజుకు స్వాగతం పలుకుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

ఆకివీడు: శ్రీవారికి సేవ చేసే భాగ్యం కలగడం పూర్వ జన్మ సుకృతం అని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా నియమితులైన గాదిరాజు సుబ్బరాజు అన్నారు. తిరుమలలో ప్రమాణస్వీకారం అనంతరం శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ఆయనకు ఆకివీడు ఉప్పుటేరు వద్ద డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, కనుమూరి ఆనందర వర్మ ఘన స్వాగతం పలికారు. అనంతరం మోటార్ సైకిళ్లు, కార్లతో భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. స్థానిక మాదివాడ వేంకటేశ్వర స్వామి, మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద సుబ్బరాజుకు గోకరాజు రామరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, దేవస్థానం చైర్మన్లు స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమానికి నాలుగు మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ర్యాలీలో ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు మేకా పార్వతి, జగ్గురోతు విజయ్‌కుమార్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సుబ్బరాజుకు ఘన స్వాగతం

ఉండి: టీటీడీ పాలక మండలి సభ్యునిగా నియమితులైన గాదిరాజు వెంకట సుబ్బరాజుకు ఉండిలో వైఎస్సార్ సీపీ నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. శుక్రవారం ఆకివీడు నుంచి ఉండి మండలం చెరుకువాడ, కలిసిపూడి మీదుగా ఉండి సెంటర్‌కు ర్యాలీ చేరుకోగా, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీ నాయకులు బాణసంచా, తీన్‌మార్ డప్పులతో పాటు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గుర్తుంచుకుంటారని, వారికి తగిన సమయంలో న్యాయం చేస్తారని తెలిపారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను సుబ్బరాజు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, రణస్తుల మహంకాళి, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవాదికారా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భీమవరం తాలూకా తాపీ పనివారల సంఘం భవనం నందు ×అసంఘటిత రంగంలోని పనివారికి న్యాయ సేవలు¥ అనే పథకం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్యానల్ లాయర్ పి.అంబేడ్కర్, డి. రవి కిరణ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎ.లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు అందకపోతే న్యాయ సేవాధికార సంస్థ వారికి దరఖాస్తు రూపంలో తెలియజేయవచ్చన్నారు. అందరూ తప్పని సరిగా ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారు రిజిస్టర్ అయ్యి ఉండాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డ్, బీద పనివారల సంక్షేమ బోర్డ్, చేతి వృత్తులు వాటి సంక్షేమ కార్పొరేషన్ వంటి సంస్థల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరూ తెలుసుకోవాలన్నారు. పని చేసే సమయంలో ఎదైన ప్రమాదానికి గురైతే సంబంధిత లేబర్ ఆఫీసర్ వారి దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని పొందే అవకాశం ఉందని ప్యానల్ లాయర్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ అధికారులు 1,2 దుర్గారావు, కేఎస్ఎన్ మల్లేశ్వరరావు, తాపీ పనివారల సంఘం అధ్యక్షుడు నల్లా సత్యనారాయణ, కార్యదర్శి పి. ఏడుకొండలు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారి దేవస్థానంలో సంప్రదాయబద్ధంగా 108 మంది మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పుప్పల మల్లేశ్వరరావు, నాగమణి దంపతులతో అమ్మవారికి గాజులతో అలంకరించారు. అనంతరం నాయుడు నాగేంద్ర దంపతుల సహకారంతో భక్తులకు హ్యాండ్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రావణమాసం పూజలు

ఉండి: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండి, చెరుకువాడ, మహదేవపట్నం, యండగండి, కోలమూరు, ఉప్పులూరు తదితర గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఓటు నమోదు సామాజిక బాధ్యత

భీమవరం(ప్రకాశం చౌక్): ఓటు నమోదు సామాజిక బాధ్యత, ఓటు సద్వినియోగం నైతిక బాధ్యత అని డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ అధ్వర్యంలో డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో ఓటు నమోదు..ఓటు సద్వినియోగం ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఈ విషయంపై చేస్తున్న కృషికి స్పందించి మా కళాశాలలో ఓటు నమోదు లేని విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఓటు నమోదు చేయిస్తామని అన్నారు. రెండు మూడు రోజులపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పాండు రంగరాజు అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వమే అన్ని చేయాలంటే కష్ట తరమని, విద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఓటు నమోదుపై కృషి చేయాలని కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఓటు హక్కు ప్రతిజ్ఞ నిర్వహించి డిగ్రీ కళాశాలలో 26 మంది పలు గ్రామాల విద్యార్థులకు ఫారమ్-6 పత్రాలను అందించామని తెలిపారు. కళాశాలలో కూడా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి రామకృష్ణంరాజు, పాలకవర్గ సభ్యులు కొత్తపల్లి శివరామ రాజు, ఎన్‌సిసి ఆఫీసర్ ఎ.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత ప్రచారం



అధికారులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారి కృష్ణవేణి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత ప్రచారం కల్పించి చేతివృత్తుల వారికి ఆసరాగా నిలవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ డిఆర్‌ఓ ఛాంబర్ నందు డిఆర్ఓ కె.కృష్ణవేణి అధ్యక్షతన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై జిల్లాస్థాయి ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ కె.కృష్ణవేణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద 18 రకాల వృత్తిదారులకు నైపుణ్యా అభివృద్ధి శిక్షణ ఇవ్వడంతో పాటు, తక్కువ వడ్డీతో రుణాలను అందజేస్తుందన్నారు. వడ్రంగి, బోట్ మేకర్, బీరువాలు తయారీ, కమ్మరి, సుత్తి - టూల్‌కిట్ తయారీదారు, తాళం వేసేవాడు, గోల్డ్ స్మిత్, కుమ్మరి, శిల్పివ్యాపారాలు, చెప్పులు కుట్టేవారు, షూ స్మిత్, మేసన్ బుట్ట/ చాప/ చీపురు మేకర్, బొమ్మ - బొమ్మల తయారీదారు, బార్బర్, గార్లాండ్ మేకర్, చాకలివాడు, దర్జీ, ఫిషింగ్ నెట్ మేకర్ తదితరులు ఈ పథకానికి అర్హులన్నారు. చేతివత్తిదారులు జిల్లాలోని 535 సచివాలయాల ద్వారా ఆధార్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వారు చేసే పనిలో నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా మరింత శిక్షణ అందిస్తామని, శిక్షణ కాలంలో 2000 రూపాయలు స్టైఫండ్ కూడా అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం 15 వేల రూపాయల విలువ కలిగిన టూల్ కిట్‌ను అందిస్తామని పేర్కొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా అభివృద్ధి

పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా అభివృద్ధి సాధ్యపడుతుందని, ఈ దిశగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని డిఆర్ఓ అన్నారు. తొలుత జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సభ్యులతో వీఆర్వో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల ఉయ్యాల ఆదిశేషు, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి కే సిహెచ్ అప్పారావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ డీఎస్‌డీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

78 శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తి

భీమవరం అర్బన్: మండలంలోని 25 గ్రామాల్లోని లబ్ధిదారులకు శుక్రవారం వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేశారు. మొత్తం 11 వేల 256 వివిధ పింఛన్‌దారులు ఉండగా 78 శాతం ఒక రోజులోనే పంపిణీ పూర్తి చేశారు. నూతనంగా 210 మందికి పింఛన్ మంజూరైనట్లు ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి తెలిపారు.





సేవే ధ్యేయంగా వలంటీర్లు



తణుకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్నవలంటీర్ శ్వేతకుమారి

పాలకోడేరు: సేవే ధ్యేయంగా పనిచేస్తూ వలంటీర్లు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పాలకోడేరు కు చెందిన గుంటబోయిన సింహాచలం అనే వృద్ధురాలు ఇంటి మెట్ల పైనుంచి పడి నడుం భాగంలో దెబ్బ తగలగా తణుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కూతురు ఇంటి వద్ద ఉంటోంది. సమాచారం తెలుసుకున్న పాలకోడేరు వలంటీర్ తొంట శ్వేతాకుమారి తణుకు వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందజేశారు. తమ అవసరాలు తీరుస్తున్న సీఎం జగన్‌కు ఈ జన్మంతా రుణపడి ఉంటామని, మరలా ఆయనే అధికారంలోకి రావాలని ఆ వృద్ధురాలు మనసారా దీవించింది.

పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి పింఛన్ అందజేత



మోహనరావుకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: పక్షవాతంతో బాధపడుతున్న రైస్ మిల్లు కార్మికుడు కుంచాడ మోహనరావుకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయగా, పెన్షన్ సొమ్మును శుక్రవారం వార్డు వలంటీర్ వెంకటరమణ, నగర పంచాయతీ చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ దొడ్డి జగదీష్‌లు కలిసి బాధితుని భార్య సరస్వతికి అందజేశారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తికీ పింఛన్ అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ సిద్ధిక్, ఉప్పాడ రామారావు, గంట్లా శివ, రాజేష్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకుని తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని సర్పంచ్ ఆరేటి సత్య వెంకట వీరాస్వామినాయుడు (పెద్దబ్బు) అన్నారు. మండలంలోని తుందుర్రు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆరేటి పెద్దబ్బు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని కోడిగుడ్లు, బియ్యం, చిక్కీలు, పాలు, అటుకులు తదితర పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. రక్తహీనత బారిన పడకుండా ప్రతి వారం ఆరోగ్యం పరీక్షలు వైద్య చేస్తున్నారన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

చెరుకువాడలో కొత్త పింఛన్ల పంపిణీ

ఉండి: గత చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ తీసుకుంటున్న వారిలో ఒకరు చనిపోతేనే గాని వేరొకరికి పింఛన్ ఇచ్చే దుర్మార్గ పరిస్థితి ఉండేదని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు(శివయ్య) అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ(సత్తిబాబు) ఆధ్వర్యాన సచివాలయం వద్ద నూతన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొర్రపాటి అనిత, బందెల ప్రమీల, గండాబత్తుల సతీష్, తాడేపల్లి చిరంజీవిరాజు పాల్గొన్నారు. మండలానికి సెప్టెంబర్ నెలలో కొత్తగా 192 పింఛన్‌లు మంజూరైనట్లు ఎంపీడీవో ఏవీ అప్పారావు తెలిపారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

తణుకు టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీ పోలీస్, పంచాయతీల నుంచి అనుమతులు పొందాలని తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం తణుకు ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో సీఐ పాల్గొని మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి గ్రామాల్లో మండిరాల ఏర్పాటుకు పంచాయతీ ఉత్సవ కమిటీ డిక్లరేషన్ ఇవ్వాలని చెప్పారు. పోలీసు నుంచి లౌడ్‌స్పీకర్‌కు సంబంధించి అనుమతి తీసుకోవాలని చెప్పారు. వినాయక చవితి ఉత్సాహంగా జరిగేందుకు శాంతియుతంగా నిర్వహించేలా సహకరించాలని కమిటీలను కోరారు. విగ్రహాలకు, పందిళ్లకు రాత్రి సమయాల్లో కాపలా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, రూరల్ ఎస్సై గురవయ్య, ఈవోపీఆర్‌డీ పీవీవీ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు స్వామి ఎంపిక

కాళ్ల: మండలంలోని సీసలి మండల పరిషత్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి 2023 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర శుక్రవారం తెలిపారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నంలో అందజేస్తారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా స్వామి మాస్టారును ఎంఈఓ-2 జి.కనకరాజు, ఎంపీపీ పెన్మత్స శిరీషా విశ్వనాధరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

బాలికలకు కెనరా బ్యాంక్ నగదు బహుమతులు

పాలకోడేరు: ఎస్సీ, ఎస్టీ బాలికలను ప్రోత్సహించేందుకు కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నట్లు బ్యాంక్ వేంద్ర బ్రాంచ్ మేనేజర్ బీఈ రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన మొత్తం ఆరుగురు బాలికలకు రూ.22,500 నగదు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జీవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

